ముగింపు దశకు కల్లుగీత

- దరి చేరని మద్యం షాపుల్లో వాటా
- ఆదాయం అంతంత మాత్రమే
- గీత కార్మికుల్లో నైరాశ్యం

మలికిపురం: గీత కార్మికులకు ఆసరాగా ఉండే కల్లు ఉత్పత్తి కాలం ముగింపు దశకు చేరుకుంది. దీంతో జీవనోపాధి నిలిచి పోతుండడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొంది. కల్లు గీత వృత్తి తప్ప మరో జీవనాధారం లేని గీత కార్మికులకు ఇలా కల్లు ఉత్పత్తి రోజులు ముగుస్తుండడంతో వారిలో నైరాశ్యం నెలకొంది. డిసెంబర్ నెల చివరి నుంచి గ్రామాల్లో కల్లు ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. తొలకరి వర్షాలు ప్రారంభమయ్యే జూన్ నెల ముగింపు వరకూ ఉత్పత్తి ఉంటుంది. గ్రామాల్లో అరుదుగా ఉన్న గీత కార్మికులు ఈ ఐదు నెలల కాలంలో కల్లు గీత ద్వారా ఆదాయం పొందుతూ జీవనోపాధి సాగిస్తారు. ఎక్సైజ్ శాఖకు కిస్తీలు చెల్లిస్తూ ఉంటారు. అయితే గీత కార్మికులకు ప్రభుత్వ ఆదరణ లేక పోవడంతో గీత ద్వారా మాత్రమే ఆసరా లభిస్తుంది. అయితే తమను ఆదుకోవాలని అనేక ఏళ్లుగా గీత కార్మికులు ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం వారి విజ్ఞప్తిని పట్టించుకోలేదు. అనాదిగా వస్తున్న గీతను నమ్ముకుని బతుకు నెట్టుకొస్తున్న కార్మికులను పట్టించుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పాలి. రాజోలు, కొత్తపేట, పి.గన్నవరం నియోజకవర్గాల్లో దాదాపు ప్రతి గ్రామంలోనూ తాటి చెట్లు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో సంప్రదాయంగా వస్తున్న గీత వృత్తిని నమ్ముకుని అనేక మంది గీత కార్మికులు జీవనోపాధి సాగిస్తూ వస్తున్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం గ్రామానికి ఇద్దరు నుంచి ఐదుగురు ఉండే గీత వృత్తి దారులు

> **గీత కార్మికులను ఆదుకోవాలి**
>
> 
>
> ప్రభుత్వం గీత కార్మికులను ఆదుకోవాలి. ఇటీవల కొన్ని మద్యం షాపులను గీత కార్మికులకు కేటాయిస్తామని చెప్పినా న్యాయం జరగలేదు. కొన్ని చోట్ల గీత కార్మికులు లేరని ఎక్సైజ్ శాఖ ఇచ్చిన నివేదిక కారణంగా అనేక మంది గీత కార్మికులకు నూతన మద్యం విధానంలో న్యాయం జరగలేదు. కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలి.
>
> – కదలి నాగేశ్వరరావు, గీత కార్మికుల సంఘం అధ్యక్షుడు, రాజోలు

ప్రస్తుతం నాలుగు గ్రామాలకు ఒక్కరూ కూడా లేరు. సముద్ర తీర గ్రామాల్లో గ్రామానికి ఇద్దరు చొప్పున ఉన్నారు. గీత కార్మికులపై ప్రభుత్వానికి బాధ్యత లేకపోవడం వారు ప్రమాదాలకు గురయితే ఆదుకోలేకపోవడం వంటి కారణాల వల్ల గీతకు చాలా మంది దూరమయ్యారు. వారి వారసులు ఈ వృత్తిలోకి రాలేదు. అయినా మరో వృత్తి చేత కాని కార్మికులు అలానే ఉండిపోయారు. అయినప్పటికీ ఈ నియోజకవర్గాల్లో సుమారు వెయ్యికి పైగా గీత కార్మికులు ఉన్నట్లు అంచనా. గీత సమయంలో కల్లు తీసుకోవడం, గీత లేని సమయంలో దింపులకు వెళ్లడం వీరి జీవనోపాధిగా మారింది. ఆదాయం అంతంత మాత్రమే. కుటుంబం గడవడం కష్టం. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలకు పలు వినతులు ఇచ్చినా వారికి ప్రయోజనం లేదు.

కల్లుకు ఆదరణ

గ్రామీణ ప్రాంతాల్లో రానురానూ కల్లుకు ఆదరణ పెరుగుతూ ఉంది. కల్లు తాగేందుకు అనేక మంది ఆసక్తి చూపుతారు. మద్యం కంటే కల్లు కాస్త ఆరోగ్యకరమని వైద్యులు చెబుతుండడంతో గ్రామీణ ప్రాంత పెద్దలు యువత కల్లు తాగేందుకు అధికంగా ఉత్సాహం చూపుతారు. వేసవిలో కల్లు ఉత్పత్తి సమయంలో 30 శాతం మద్యం అమ్మకాలు తగ్గిపోతాయంటే నమ్మశక్యం కాదు.

కష్టం అధికం.. ఆదాయం అంతం మాత్రం

ఉదయం సాయంతం తాటి చెట్టు ఎక్కి కల్లు ఎక్కి కల్లు దింపాలి. ఇలా రోజుకు ఒక్కో కార్మికుడు 10కి పైగా చెట్లు ఎక్కాలి. ఒక్కో తాటి చెట్టు నుంచి మూడు నుంచి నాలుగు లీటర్ల కల్లు మాత్రమే ఉత్పత్తి అవుతుంది. లీటరు కల్లుకు రూ.50 మాత్రమే వస్తుంది. ఇందులో ఎక్సైజ్ శాఖకు కిస్తీ చెల్లించాలి. ఇది గిట్టుబాటు కాదు. అయినా మరో వృత్తి చేతకాక ఇందులోనే ఉండిపోతున్నారు.



అంతర్వేదికర గ్రామంలో కల్లు గీస్తున్న కార్మికుడు

ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థం

అంబాజీపేట: తొండవరం గ్రామంలో వేంచేసిన రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. ముక్కామలలో వేంచేసిన గ్రామదేవత లంకాలమ్మ అమ్మవారి తీర్థం జరిగింది. ఆయా గ్రామాల ఆడపడుచులు, భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు, చలివిడి పానకాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముక్కామలలో అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

రైతులకు పవర్ టిల్లర్ల పంపిణీ

మామిడికుదురు: మండల పరిధిలో 11 మంది రైతులకు పవర్ టిల్లర్లు, ఎనిమిది మందికి కల్టివేటర్లు, ఒకరికి లెవెలింగ్ బ్లేడ్, ఒక సంఘానికి 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను ప్రభుత్వం అందిస్తోందని ఏఓ సత్యనారాయణ తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమం అమలాపురంలో జరుగుతుందన్నారు. మండలంలోని 2,200 ఎకరాల్లో సార్వా సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. ఎకరానికి 35 బస్తాల దిగుబడితో ముంపును తట్టుకుని 160 రోజుల్లో కోతకు వచ్చే ఎంటీయూ–1318 రకంతో పాటు ఎంటీయూ–1224 స్వర్ణ సబ్, ఎంటీయూ–1262, ఎంటీయూ–1232 రకాల విత్తనాలు మార్టేరులో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విత్తనాల కోసం సైంటిస్ట్ రోజా, మొబైల్ నంబర్ 9490913434ను సంప్రదించాలని ఏఓ సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆమె అందుబాటులో ఉంటారని చెప్పారు.

క్లుప్తంగా

గాయపడిన ఆబోతుకు చికిత్స



సఖినేటిపల్లిపాలెం సెంటర్లో ఆబోతుకు వైద్య సేవలందిస్తున్న యూత్, రైతులు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిపాలెం సెంటర్లో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఒక ఆబోతుకు స్థానికులు వైద్య సేవలందించారు. రోడ్డుపై వెళుతున్న ఆబోతును వెహికల్ ఢీకొట్టడంతో కాలుకు పెద్ద దెబ్బ తగిలి తీవ్రంగా రక్తస్రావం అయింది. దీంతో హుటాహుటిన ఆబోతును తాళ్లతో బంధించి రోడ్డు పక్కనే వైద్యం అందజేశారు. స్థానిక యూత్, రైతులు, జంతువులు–పక్షులు–పర్యావరణ పరిరక్షణ టీం సభ్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో పరిసర గ్రామాలకు కేంద్రంగా ఉన్న సఖినేటిపల్లి పశువైద్యశాల ఉదయం నిర్ణీత సమయానికి తెరచుకోక పశువులకు అత్యవసర వైద్య సేవలు అందడం లేదని, దీనిపై ప్రజాప్రతినిధులకు, సదరు శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్టు స్థానికులు చెప్పారు.

పార్టీ రాష్ట్ర నాయకుడికి గన్నవరపు పరామర్శ



పార్టీ సీనియర్ నాయకుడు గోపిని పరామర్శిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: ఇటీవల ఆపరేషన్ చేయించుకుని కోలుకుంటున్న కె.ముంజవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కుంపట్ల గోవిందరావు (గోపి)ని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు మంగళవారం పరామర్శించారు. పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్, యన్నాబత్తుల ఆనంద్, కుంపట్ల నాగప్రసాద్, దేశిరాజు సీతారామయ్య, పేరిచర్ల రామరాజు, కోట హనుమంతరావు, చింతా రవి, గ్రంధి రామకృష్ణ, మంగం రవికుమార్, నాగాబత్తుల సూర్యనారాయణ తదితరులు గోపిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఇసుక తవ్వకాల్లో లోపించిన పారదర్శకత



ఇసుక తవ్వకాలపై ప్రసంగిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్తిబాబు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్ల ఇసుక తవ్వకాల్లో పారదర్శకత లోపించిందని మండల కమ్యూనిస్టు పార్టీ శాఖ తీవ్రంగా ఆరోపించింది. స్థానిక స్వచ్ఛంద సమతా కార్యాలయంలో మంగళవారం కొత్తపేట నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి సత్తిబాబు పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో ఇసుక ర్యాంపులు అన్నిట్లో ఇసుక, మట్టిలో జరుగుతున్న దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం జరిపిన ఇసుక అక్రమాలపై సిట్ వేసిన ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి ప్రస్తుత తవ్వకాలపై కూడా విచారణ చేసి నిగ్గు తేల్చాలని ఆయన కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.రవికుమార్, సమితి సభ్యులు సామ్యూల్, యేసురాజు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి బదిలీలు

ముమ్మిడివరం: సమగ్ర శిక్షా పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలు జరగనున్నాయి. సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు ఆదేశాల మేరకు రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలు నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి మమ్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఐఈఆర్‌పీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు, సీఆర్ఎంటీలు, మండల లెవిల్ అకౌంటెంట్లు, సైట్ ఇంజినీర్లు, , డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లకు బదిలీలు ఉంటాయన్నారు. ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు బదిలీలకు జిల్లా స్థాయిలో దరఖాస్తులు స్వీకరిస్తారని, 23న సీనియార్టీ జాబితా ప్రదర్శన, 27 వరకు బదిలీల దరఖాస్తులపై అభ్యంతరాలు ఉంటాయన్నారు. 28న కౌన్సిలింగ్ నిర్వహించి ఉత్తర్వులు ఇస్తారన్నారు. బదిలీలపై అభ్యంతరాలుంటే జూలై 5న రాష్ట్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఘనంగా వీరభద్రుని సంబరం

తాళ్లరేవు: పి.మల్లవరంలో వీరభద్రుని సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బాదరాల శ్రీనివాసరావు, కౌసల్య దంపతులచే వీరభద్రునికి విశేష పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి పోలేకుర్రు కాలువలో పవిత్ర స్నానాలాచరించారు. వీరముష్టుల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో స్వామివారి సంబరాన్ని వైభవంగా చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా గ్రామదేవతల తీర్థం

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలో గ్రామదేవతగా పూజలందుకుంటున్న మురుగులమ్మ, మాగంలో గ్రామదేవతలుగా పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి, మరిడమ్మలకు మంగళవారం తీర్థ మహోత్సవాలు ఘనంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గరగ నృత్యాలు, చిత్ర విచిత్ర వేషధారణలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవార్లను పెద్ద ఎత్తున భక్తులు దర్శించి కానుకలు మొక్కులు చెల్లించారు. చలివిడి, వడపప్పు, బెల్లంపానకం వంటివి నైవేద్యంగా సమర్పించారు.

వైభవంగా కట్వలాంబిక అమ్మవారి తీర్థం

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామ దేవత కట్వలాంబిక అమ్మవారి జాతర, తీర్థమహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి చిన్న జాతర, సోమవారం రాత్రి పెద్ద జాతర జరిపారు. మంగళవారం తీర్థ మహోత్సవాలను దేవస్థానం ఈఓ కామేశ్వరరావు, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పర్యవేక్షణలో, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. వీధి వీధినా అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వాగతం పలికారు. ఇంటింటా భక్తులు పసుపు, కుంకుమలు, పానకాలు, ఇతర నైవేద్యాలు, మొక్కులు సమర్పించారు. కట్వలాంబిక తీర్థం పురస్కరించుకుని అవిడి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గ్రామం భక్తులతో కిటకిటలాడింది. కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



అవిడిలో కట్వలాంబిక అమ్మవారి గరగలను ఊరేగిస్తున్న భక్తులు

భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన

అయినవిల్లి: భూసార పరిరక్షణకు బయోచార్ ఎంతగానో ఉపయోగపడుతోందని బయోచార్ వినియోగం ద్వారా భూమిలో అధిక పోషకాలను పునరుద్ధి చేసుకోవచ్చని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్) ఎలియాజర్, రాజమండ్రి డీపీఎం బొర్రా తాతారావు రైతులకు వివరించారు. మంగళవారం అయినవిల్లి మండలం నేదునూరులో కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ వద్ద కృషి వల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ గణపతి వీరరాఘవులు అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బయోచార్ వినియోగించడం ద్వారా భూసార పరిరక్షణ ఎలా చేపట్టాలో డీపీఎంలు ఎలియాజర్, తాతారావులు వివరించారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం ఎలియాజర్, రాజమండ్రి డీపీఎం బొర్రా తాతారావు, కృషీవల డైరెక్టర్లు సీఈవో అడ్డాల గోపాలకృష్ణలు బయోచార్ వినియోగంతో భూసారం ఎలా పెంచుకోవచ్చో వివరించారు. ప్రతి రైతు ఉదయాన్నే పంటపొలాన్ని పరిశీలించాలన్నారు. మొక్కలకు కావలసిన అన్ని పోషకాలను ప్రకృతి సిద్ధంగా అందించాలన్నారు. కోకోపిట్ కంపోస్టు, బొగ్గు, పాడి బెల్లం నీళ్లతో కలిపిన మట్టి జీవామృతం తయారు చేసి సుపోషకమైన ఎరువులు ఎలా తయారు చేసుకోవచ్చో లైవ్ డెమో ద్వారా కృషి వల్ల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ సీఈఓ అడ్డాల గోపాలకృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. డీపీఎం తాతారావు మాట్లాడుతూ ప్రతి రైతు వ్యవసాయంలో కాలుష్యాలను వెదజల్లే రసాయన ఎరువులను వినియోగాన్ని తగ్గించాలన్నారు. పంటలకు పోషకాలు అందించే బయోచార్ వంటి ఎరువులను ఉపయోగించాలన్నారు. డ్రోన్స్ ద్వారా పిచికారీ చేసే మందులను సైతం ప్రకృతి సిద్ధమైనవి సహజమైనవి వినియోగించాలని వివరించారు. తక్కువ నీటిని వినియోగించి వ్యవసాయం చేయడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేయాలని రైతులకు సూచించారు. ఆహారాన్ని వృథా చేయరాదని ఆహారాన్ని గౌరవించాలన్నారు. చైర్మన్ గణపతి వీరరాఘవులు మాట్లాడుతూ బయోచార్ ఎరువును రైతులకు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కృషీవల కోకోనట్ ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ రైతులందరూ స్వయంగా తయారు చేసుకోవడం గానీ లేదా కంపెనీ ద్వారా ఈ ఎరువుని పొందడానికి ప్రయత్నించాలని సూచించారు. కృషీవల డైరెక్టర్, నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్మెంట్ నెంబర్ ముత్యాల శ్రీరామనాగేంద్ర ప్రసాద్ జమ్మిలు మాట్లాడుతూ రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అయినవిల్లి మండల వ్యవసాయాధికారి శోభ, ఉద్యాన అధికారి, పలువురు రైతు నాయకులు హాజరయ్యారు.



బయోచార్ ఎరువు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంలు ఎలియాజర్, బొర్రా తాతారావు

ప్రతిభావంతులకు సన్మానం

మామిడికుదురు: ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చెప్పారు. పాశర్లపూడిలంకకు చెందిన కోలా ప్రవీణ్‌కుమార్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో 328వ ర్యాంకు, ఎంసెట్‌లో 153వ ర్యాంకు సాధించాడు. అదే గ్రామానికి చెందిన కోలా మధువల్లిక పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచి కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా అవార్డు అందుకుంది. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, మధువల్లికను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, పార్టీ నేతలు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, చెరుకూరి పార్వతి, పార్టీ మండల శాఖ అధ్యక్షులు జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డు గ్రహీత ప్రవల్లికకు సన్మానం

మామిడికుదురు: ఇంటర్‌లో 989 మార్కులతో ప్రతిభ చూపిన రాజోలు మండలం పొదలాడకు చెందిన లిఖితపూడి ప్రవల్లికను మంగళవారం మామిడికుదురులో ఘనంగా సత్కరించారు. మండల అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం, మాల మహానాడు ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రవల్లిక ప్రతిభా పురస్కారం కూడా అందుకోవడం ఆనందంగా ఉందని ఆయా సంఘాల ప్రతినిధులు బొంతు మణిరాజు, కలిగితి పళ్లంరాజు, నల్లి శ్రీను పేర్కొన్నారు. ప్రవల్లికకు అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో మట్టా సత్తిబాబు, నెల్లి దుర్గాప్రసాద్, కొల్లాబత్తుల వెంకటరమణ, పిల్లి శ్రీను, బత్తుల శేఖర్, నీతిపూడి మహేష్, ఉక్కురి శ్రీను, ఉండ్రు జాన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మట్టపర్రులో పొలంబడి

మలికిపురం: మండలంలో మట్టపర్రులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చింత రమ్య ప్రియాంక పాల్గొని రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులు వివరించారు. సార్వా సాగుకు సిద్ధమవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్ష ఫలితాలు, ఈ–కేవైసీ నార్మల్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి రకం 1318 రకం యొక్క ఆవశ్యకత గూర్చి రైతులతో చర్చించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు పి.శివరామకృష్ణ, టీడీ షణ్ముఖ, మట్టపర్రు విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.



మట్టపర్రు పొలంబడిలో పాల్గొన్న ఏఓ రమ్య ప్రియాంక

నేడు నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం: పోతవరంలోని భారత్ పెట్రోల్ బంకు ఎదురుగా బుధవారం ఉదయం 9.30 గంటలకు పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డితో పాటు పీఏసీ సభ్యులు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కోఆర్డినేటర్లు, పార్టీ నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

మామిడికుదురు: విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్లో మంగళవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల పరిధిలో 72 పాఠశాలలకు చెందిన 3,373 మంది విద్యార్థులకు కిట్లు అందించడం జరుగుతుందన్నారు. తల్లికి వందనం ద్వారా ఒక్కో విద్యార్థికి రూ.13 వేల ఆర్థికసాయం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ అడబాల తాతకాపు, ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, ఎంఈఓ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, స్థానికులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

5,914 మందికి అన్నదాతా సుఖీభవ

మామిడికుదురు: మండలంలోని 5,914 మంది రైతులకు అన్నదాతా సుఖీభవ సాయం మంజూరైందని మండల వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆయన మామిడికుదురులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21న రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ ఆర్థికసాయం రూ.5 వేలు బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందన్నారు. వెబ్‌ల్యాండ్ ఆధారంగా లబ్ధిదారులను గుర్తించారన్నారు. 10 సెంట్లకు మించి వరి, కొబ్బరి తోటలు ఉన్న వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. ఆక్వా చెరువులకు వర్తించదని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి టి.దివ్యశ్రీ అన్నారు. ఈ నెలాఖరు వరకూ నిర్వహించే అతిసార నిరోధక కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముక్కామల పీహెచ్‌సీ పరిధిలో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ పార్ట్‌నైట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించి అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఐదేళ్ల లోపు పిల్లల వివరాలు సేకరించాలనిఅ, వాళ్లకు నీళ్ల విరోచనాలు అయితే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్స్ ద్వారా చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం .రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెనికేరులో..

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల వర్షాలు ప్రారంభమైనందున అతిసార వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ అధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లో అతిసార వ్యాధి నుంచి చిన్నారులను నుంచి రక్షించుకోవాలంటూ ఆరోగ్య, ఆశ సిబ్బంది మంగళవారం భారీ ర్యాలీలు నిర్వహించారు. అతిసార వ్యాప్తి నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.



ముక్కామలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది




పెనికేరులో అతిసార నియంత్రణ కోరుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఓటీపీలు చెప్పడంతో రూ.5.1 లక్షల స్వాహా

పి.గన్నవరం: గుర్తుతెలియని వ్యక్తులకు ఫోన్‌లో ఓటీపీలు చెప్పడంతో ఒక వ్యక్తి రూ.5.1 లక్షల మేర పోగొట్టుకున్నాడు. ఇందులో అతడికి తెలియకుండా రూ.5 లక్షలు లోన్ తీసుకుని మరీ తస్కరించారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ మంగళవారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పి.గన్నవరం మండలం నరేంద్రపురానికి చెందిన నేలపూడి శ్రీనివాసరావుకు అమలాపురంలోని యాక్సిస్ బ్యాంకులో ఖాతా ఉంది. అతడికి గత నెల 27న గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగారు. ఓటీపీ చెప్పడంతో అతడి ఖాతాలో ఉన్న రూ.10 వేలను తస్కరించడంతో పాటు, ఆ ఖాతాకు లింకు అయిన ఫోన్ నెంబర్‌ను మార్చేశారు. తన ఖాతా నుంచి రూ.10 వేలు తీసినట్టు సెల్‌కు మెసేజ్ రావడంతో బ్యాంకుకు వెళ్లాడు. దీంతో బ్యాంకు సిబ్బంది జరిగిన విషయాన్ని బాధితుడికి వివరించారు. గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ నంబరు తీసి వేసి, శ్రీనివాసరావు నెంబర్‌ను అతడి ఖాతాకు లింక్ చేశారు. ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని హెచ్చరించారు. ఇదిలా ఉండగా ఈనెల 7వ తేదీన మళ్లీ గుర్తు తెలియని వ్యక్తి శ్రీనివాసరావుకు ఫోన్ చేశాడు. మీరు గతంలో పోగొట్టుకున్న రూ.10 వేలను తిరిగి మీ ఖాతాకు జమ చేస్తున్నామని, ఓటీపీ చెప్పమని అడిగాడు. గతంలో పోయిన సొమ్ము తిరిగి వస్తుందన్న ఆనందలో ఆయన మళ్లీ ఓటీపీ చెప్పాడు. దీంతో అగంతకుడు శ్రీనివాసరావు ఖాతా నుంచి అతని ఫోన్ నెంబర్ తొలగించి, వారి నెంబర్‌ను లింక్ చేసుకున్నాడు. ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా అతడి పేరున రూ.5 లక్షలు రుణం తీశాడు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు ఖాతాలో జమ అయిన రుణం సొమ్మును ఆన్‌లైన్‌లో కాజేశాడు. అయితే శ్రీనివాసరావు రూ.10 వేలు ఇంకా పడలేదని మళ్లీ బ్యాంకుకు వెళ్లాడు. అతని ఖాతాను తనిఖీ చేస్తే రూ.5 లక్షలు రుణం తీసి, చార్జీలు పోను మిగిలిన సొమ్మును అగంతకుడు కాజేసినట్టు బ్యాంకు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితుడు శ్రీనివాసరావు మంగళవారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని ఎస్సై హెచ్చరించారు.

క్షయ నిర్మూలన చర్యలపై అవగాహన



రాజోలులో క్షయ నిర్మూలన ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

రాజోలు: క్షయ నిర్మూలన చర్యలపై తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి మానససుప్రియ మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజోలు సర్పంచ్ రేవు జ్యోతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్షయ నిర్మూలన చేద్దామంటూ నినాదాలు చేస్తూ క్షయ నిర్మూలన ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ మానస సుప్రియ మాట్లాడుతూ టీబీ ముక్తి భారత్ అభియాన్‌లో భాగంగా క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 36 మందికి కళ్లె నమూనాలు, నలుగురికి ఎక్స్‌రే పరీక్షలు చేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి రెహమాన్, టీబీ సూపర్‌వైజర్ జి.సర్వారాయుడు, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా బీజేపీ ప్రభుత్వం

సఖినేటిపల్లి: దేశంలో పేదలకు అండగా కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని ఆ పార్టీ వికసిత్ భారత్ మండల కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు అన్నారు. మంగళవారం గొంది గ్రామంలో ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన దినోత్సవ సభ నిర్వహించారు. వారిరువురు మాట్లాడుతూ, ప్రధాని మోదీ అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి భారతదేశాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తున్నారని చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ, పేదలకు ఉచితంగా గరీబ్ కల్యాణ్ అన్నయోజన, సమృద్ధిగా తాగునీటి సరఫరాకు జల్‌జీవన్ మిషన్ పథకాలను కేంద్రం అమలు చేస్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, ప్రధాన కార్యదర్శి బోణం నాయుడు, నాయకులు ఇందుకూరి సుబ్బరాజు, రావూరి బాబ్జీ, బొమ్మిడి నరసింహస్వామి పాల్గొన్నారు.